డోర్ డెలివర్రీ..

రేషన్ డోర్ డెలివరీ.. కూటమి ప్రభుత్వంలో కార్డుదారులకు వర్రీ అయ్యింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చి, ప్రజా పంపిణీ వ్యవస్థను పకడ్బందీగా అమలు చేశారు. పల్లె, పట్టణ ప్రాంతాల్లో చౌక దుకాణాల వద్దకు కార్డుదారులు పరుగులు పెట్టకుండా ఇళ్ల వద్దకే (ఎండీఎం వాహనాల ద్వారా)రేషన్ సరఫరా చేయించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలకు మళ్లీ అప్పటి టీడీపీ పాలనలోని కష్టాలే వచ్చాయి. ఈ నెల రేషన్ పంపిణీలో ఒకటీ అరా తప్పా ఎక్కడా ఎండీఎం వాహనాలు వీధుల్లో తిరుగుతున్న దాఖలాలు లేవు. దీంతో లబ్ధిదారులు ఎంపిక చేసిన స్టాక్ పాయింట్ వద్దకే వెళ్లి బియ్యం, పప్పులు తెచ్చుకునే పరిస్థితి కనిపిస్తోంది.

- కనిపించని ఎండీఎం వాహనాలు
- ఇళ్లకే పరిమితమైన వైనం
- డీలర్ల మార్పుతో తలెత్తిన ఇబ్బందులు
- సరుకుల కోసం ఎఫ్‌పీ షాపుల వద్దకు క్యూకట్టిన జనం
- అవస్థలు పడుతున్న కార్డుదారులు

రాయదుర్గం: రాయదుర్గం నియోజకవర్గంలోని అర్బన్‌తోపాటు కణేకల్లు, బొమ్మనహాళ్, డీహీరేహాళ్, గుమ్మఘట్ట, రాయదుర్గం మండలాల్లో 219 చౌకధాన్యపు డిపోలు ఉన్నాయి. వీటి పరిధిలోని 99,300 ఏఏవై, తెల్ల రేషన్ కార్డులు ఉన్నాయి. 59 ఎండీఎం వాహనాల ద్వారా ఇంటింటికీ 2,97,357 కిలోల బియ్యం సరఫరా చేస్తారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే చౌకదుకాణ డీలర్లను మార్చేసి, వారి అనుయాయులకు రేషన్ పంపిణీ బాధ్యతను కట్టబెట్టారు. దీంతో కొందరికి థంబ్ (బయోమెట్రిక్) మారగా, మరికొందరి వచ్చే నెలకు మారాల్సి ఉంది. ఈ నేపథ్యంలో పాత డీలర్లు థంబ్ వేస్తేనే వేయింగ్ మిషన్ ద్వారా పంపిణీ ప్రక్రియ ప్రారంభమవుతుంది. దీన్ని సాకుగా చూపి చాలా చోట్ల స్టాక్ పాయింట్ల వద్దనే రెండు రోజుల నుంచి రేషన్ పంపిణీ ప్రక్రియ కొనసాగిస్తున్నారు. ఇంటి వద్దే సరుకులు తీసుకునేందుకు అలువాటు పడిన వృద్ధులు, దివ్యాంగులు, అనాథలు, నిత్యావసర వస్తువులు తీసుకెళ్లేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

సతాయిస్తున్న సర్వర్..

కొత్తగా థంబ్ విధానాన్ని పునరుద్ధరించడంతో కొన్నిచోట్ల వేయింగ్ మిషన్లు సతాయించాయి. సర్వర్ కూడా సక్రమంగా పనిచేయక లబ్ధిదారులు డిపోల వద్దే గంటల తరబడి పడిగాపులు కాయాల్సి వచ్చింది. ఇంకొన్ని చోట్ల అయితే డిపోలే తెరవలేదు. అధికారులకు ఫోటోలు మాత్రమే పెట్టి, మమ అనిపించేశారు. ప్రతి లబ్ధిదారుడి నుంచి రెండు సార్లు వేలిముద్రలు సేకరించాల్సి ఉండడంతో కొన్ని ఇబ్బందులు తలెత్తాయి.



రాయదుర్గం పట్టణంలోని ఓ దుకాణంలో బియ్యం కోసం వచ్చిన కార్డుదారులు

నియోజకవర్గంలో చౌక ధాన్యపు డిపోల వివరాలు			
మండలం	ఎఫ్‌పీ షాపులు	ఎండీఎం వాహనాలు	రేషన్‌కార్డులు
కణేకల్లు	47	11	19,541
బొమ్మనహాళ్	39	10	18,236
డి హీరేహాళ్	34	09	14,482
గుమ్మఘట్ట	44	10	16,427
రాయదుర్గం	55	19	30,614
మొత్తం	219	59	99,300

సజావుగా పంపిణీ జరిగేలా చూస్తాం



రేషన్ సరుకులన్నీ సజావుగా పంపిణీ జరిగేలా కృషి చేస్తాం. లబ్ధిదారులకు ఇబ్బందులు తలెత్తకుండా ఎండీఎం వాహనాల్లోనే సరుకులన్నీ ఇళ్లవద్దకే పంపిస్తాం. పంపిణీ చేపట్టి రెండు రోజులే అయ్యింది. వాహనం ఎక్కడెక్కడ కదలలేదో విచారించి, తప్పక పంపే బాధ్యత తీసుకుంటాం. ప్రజా పంపిణీలో ఎక్కడా ఏ చిన్న పొరపాటుకూ తావివ్వకుండా పటిష్ట చర్యలు తీసుకుంటాం. – సుదర్శనాచారి, సివిల్ సప్లయీస్ డీటీ, రాయదుర్గం

వాహనాల్లోనే అందించాలి

ఎండీఎం వాహనాల్లోనే నిత్యావసర సరుకులు అందించాలి. గత రెండు రోజుల నుంచి డీలర్లు నిల్వ చేసిన దుకాణాల్లోనే పంపిణీ ప్రక్రియ సాగుతోంది. ఈ నేపథ్యంలో పనులన్నీ మానుకొని కార్డుదారులు గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోంది. పంపిణీ దారులను ప్రశ్నిస్తే కొత్తగా దుకాణం తెరవడంతో ఇబ్బందులు ఉన్నాయి. వచ్చే నెల వేస్తామని డీలర్లు చెప్తున్నారు. అధికారులు దృష్టి సారించి సమస్యకు పరిష్కారం చూపాలి. ప్రజలకు ఇబ్బందులు తొలగించాలి. – ఎం. శ్రీనివాసులు, పట్టణ వాసి, రాయదుర్గం

క్లుప్తంగా

ముగిసిన చిన్న పీర్లపండుగ



కలుగోడు గ్రామంలో ఊరేగుతున్న పీర్ల స్వాములు

గుమ్మఘట్ట: మత సామరస్యానికి ప్రతీక అయిన చిన్న మొహర్రం వేడుకలు ఘనంగా జరిగాయి. మండలంలోని కలుగోడు, గుమ్మఘట్ట గ్రామాల్లో కొలువుదీరిన చిన్నపీర్లస్వాములు వేకువ జామున అగ్నిగుండం ప్రవేశం చేశాయి. సాయంత్రం గ్రామాల్లో ఊరేగించి చక్కెర,బెల్లంతో చదివింపులు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం పీర్లను జలధికి తీసుకెళ్లారు. ఎస్ఐ వెంకటేశ్వర్లు నేతృత్వంలో బందోబస్తు చేపట్టారు.

నేడు హుండీ కానుకల లెక్కింపు

బొమ్మనహాళ్: మండలంలోని నేమకల్లులో వెలసిన ఆంజనేయస్వామి ఆలయంలోని హుండీ కానుకలను శనివారం లెక్కించనున్నట్లు ఈఓ నరసింహారెడ్డి తెలిపారు. ఏడాది పాటు ఉన్న హుండీ కానుకలను ఉరవకొండ ఇన్‌స్పెక్టర్ రాణి సమక్షంలో లెక్కిస్తున్నట్లు తెలిపారు.

ఏకాగ్రతతో శిక్షణ పొందాలి



కూడేరు: మాట్లాడుతున్న క్యాంప్ కమాండర్ కల్నల్ రాడ్రిక్స్

కూడేరు: ఏకాగ్రతతో శిక్షణ పొందితే దేశ రాజధాని ఢిల్లీలో సెప్టెంబర్‌లో జరగనున్న తల్ సైనిక్-2024 శిబిరానికి ఎంపిక అవుతారని ఎన్‌సీసీ క్యాంప్ కమాండర్ కల్నల్ రాడ్రిక్స్ క్యాడెట్లకు సూచించారు. బ్రాహ్మణపల్లి వద్ద ఉన్న ఎన్‌సీసీ నగర్‌లో సీఏటీసీ-4 , తల్ సైనిక్ శిక్షణా తరగతులు శుక్రవారం ప్రారంభయ్యాయి. హైదరాబాద్, సికింద్రాబాద్, వరంగల్, నిజామాబాద్, కర్నూలు, గుంటూరు, విశాఖపట్నం, కాకినాడ, తిరుపతి గ్రూపులకు చెందిన 650 మంది క్యాడెట్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా క్యాడెట్లనుద్దేంచి క్యాంప్ కమాండర్ మాట్లాడారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా పింగళి వెంకయ్య జయంతి




ఉరవకొండలో పింగళివెంకయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

ఉరవకొండ: ఉరవకొండ మేజర్ పంచాయతీ కార్యాలయ ఆవరణలో పింగళి వెంకయ్య జయంతి వేడుకలు శుక్రవారం నిర్వహించారు. సర్పంచ్ లలితమ్మ, ఈఓ గౌస్‌సాహెబ్ ఆధ్వర్యంలో పాలకవర్గ సభ్యులు పింగళి వెంకయ్య చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు రత్న, ఓబుళమ్మ, వాసు, ముష్కిన్, నిరంజన్‌గౌడ్, రవి, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

8న ఎస్‌ఎంసీ ఎన్నికలు

గుమ్మఘట్ట: ఈ నెల 8న ప్రభుత్వ పాఠశాలల్లో (పాఠశాల యాజమాన్య కమిటీ) ఎస్‌ఎంసీ ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ నాగమణి-1, ఎంఈఓ-2 రామచంద్ర తెలిపారు. మండల వ్యాప్తంగా ఎంపీపీ ప్రభుత్వ పాఠశాలలు 41, ప్రాథమికోన్నత పాఠశాలలు 4, జెడ్పీ ఉన్నత పాఠశాలలు 9, ఎంజేపీ -1, కేజీబీవీ-1గురుకుల పాఠశాలలో ఎస్‌ఎంసీ ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. 5న అభ్యంతరాలు స్వీకరించి ,8న ఎన్నికలు నిర్వహించి, అదేరోజున ఫలితాలను ప్రకటిస్తామని వారు తెలిపారు.

6న కలెక్టరేట్ వద్ద మహాధర్నా



జీపుజాతానుద్దేశించి ప్రసంగిస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

ఉరవకొండ: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం పథకాన్ని అమలుచేసి, గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల ఆకలితీర్చాలని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జాన్సన్‌బాబు, శివారెడ్డి కోరారు. శుక్రవారం ఉరవకొండలోకి ఏఐఎస్‌ఎఫ్ చేపట్టిన జీపుజాతా ప్రవేశించింది. జీపుజాతాకు ఏఐఎస్‌ఎఫ్ మండల అధ్యక్షుడు హరున్‌రషీద్ ఆధ్వర్యంలో విద్యార్థి సంఘం నాయకులు స్వాగతం పలికారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ ఈనెల 6న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ప్రభుత్వ హాస్టల్స్ సమస్యలు పరిష్కారించాలని మహా ధర్నా చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి హనమంతు, రాష్ట్ర సమితి సభ్యులు స్వరూప, జిల్లా నాయకురాలు జ్యోతి, సహాయ కార్యదర్శి వెంకటనాయక్, జిల్లా ఉపాధ్యక్షులు నరసింహ, వంశీ, వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే వ్యాధుల నియంత్రణ

- మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేంద్రప్రసాద్

రాయదుర్గంటౌన్: పరిసరాల శుభ్రతతోనే సీజనల్ వ్యాధులను నియంత్రించవచ్చని, ప్రతి శుక్రవారం అందరూ విధిగా డ్రైడే పాటించాలని రాయదుర్గం డివిజనల్ మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేంద్రప్రసాద్ తెలిపారు. పట్టణంలోని 7వ సచివాలయం పరిధిలోని వార్డుల్లో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని చేపట్టారు. దోమ కాటు వల్ల డెంగీ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రస్తుత సీజన్‌లో తీవ్రమైన జ్వరం, తల నొప్పి, చర్మంపై దద్దుర్లు, కళ్లలో మంట, కండరాలు, కీళ్ల నొప్పులు వంటి లక్షణాలు ఉంటే వెంటనే ప్రభుత్వాస్పత్రికి వచ్చి చికిత్స తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సెక్రటరీ ప్రమీల, విజయలక్ష్మి, శానిటరీ సెక్రటరీ ఓంకార్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత పాటించాలి

బొమ్మనహాళ్: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల శుభ్రతను పాటించి, వ్యాధులకు దూరంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారులు శ్రీలక్ష్మి, మల్లీశ్వరి సూచించారు. శుక్రవారం మండలంలోని ఉద్దేహాళ్‌లో డెంగీ, మలేరియా, సీజనల్ వాధులపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ నాగమణి, ఆరోగ్య కార్యకర్తలు గోవర్ధన, జైనాబీ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



మహిళలకు అవగాహన కల్పిస్తున్న మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేంద్రప్రసాద్

వేపులపర్తిలో డ్రైడే

బ్రహ్మసముద్రం: మండలంలోని వేపులపర్తి గ్రామంలో శుక్రవారం డ్రైడే ఫ్రైడే కార్యక్రమం చేపట్టారు. శుక్రవారం వేపులపర్తిలో ఈఓఆర్డీ వెంకటనాయుడు పర్యటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామంలో అపరిశుభ్రతను తొలగించాలని, డ్రైనేజీలు శుభ్రం చేయించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సత్యమ్మ, సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సుప్రీం తీర్పుపై ఎమ్మార్పీఎస్ నాయకుల సంబరాలు

గుమ్మఘట్ట: ఎస్సీ వర్గీకరణకు దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు సానుకూలంగా తీర్పు ఇవ్వడంపై ఎమ్మార్పీఎస్ నాయకులు సంబరాలు చేసుకున్నారు. మండలంలోని కలుగోడు, బేలోడు, భూపసముద్రం, తాళ్లకెర, గుమ్మఘట్ట, గోనబావి, బీటీపీ గ్రామాల్లో జగ్జీవన్‌రామ్ చిత్రపటాలకు పూలమాల వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బీటీపీ గోవిందు, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు హరిగోపాల్, ఎంపీపీ భవాని, సర్పంచులు కవిత, రాజేష్, జయమ్మ, ఎంపీటీసీలు ఓబుళకాంతమ్మ, గౌరమ్మ, నాయకులు బేలోడు రామాంజనేయులు, కేవం రాజు, భూపసముద్రం సవారప్ప, మల్లేశ్, బీటీపీ హనుమంతు, తాళ్లకెర మహేష్, మల్లయ్య, వన్నూరుస్వామి పాల్గొన్నారు.

శెట్టూరు: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన సానుకూల తీర్పు హర్షించదగ్గ విషయమని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు తిప్పేస్వామి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మార్పీఎస్ నాయకులు పూలమాల వేసి, నివాళి అర్పించారు. కార్యక్రమంలో నాయకులు మారెన్న, శివ, రామమూర్తి, నాగభూషణం, చిన బాబు, వన్నూరుస్వామి, అంజనేయులు, నవీన్ తదతరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై సుప్రీం తీర్పు హర్షణీయం

బొకుగుప్ప: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు సానుకూల తీర్పు హర్షణీయమని బీజేపీ మండల అధ్యక్షుడు వన్నూరస్వామి తెలిపారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ సర్కిల్ వద్ద బీఆర్ అంబేడ్కర్, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చిత్రపటాలకు ఎన్‌డీఏ కూటమి పార్టీల నాయకులు, ఎమ్మార్పీఎస్ నాయకులతో కలసి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీజేపీ, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.



బ్రహ్మసముద్రంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

బ్రహ్మసముద్రం: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయమని ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు మారెన్న, ఆనంద్, వన్నూరుస్వామి , ఏసేపు, ఈశ్వర్, ఆదిమూర్తి, గంగాధర్, నింగప్ప తదితరులు పాల్గొన్నారు.

చౌడేశ్వరీదేవి జయంతి వేడుకలకు ఆహ్వానం



కొనకొండ్లలో ఎమ్మెల్సీవై.శివరామిరెడ్డిని ఆహ్వానిస్తున్న దేవాంగనాయకులు



అనంతపురంలో మాజీ ఎంపీ రంగయ్యకు ఆహ్వాన పత్రిక అందిస్తున్న దృశ్యం

వజ్రకరూరు: ఈనెల 4న జరగనున్న చౌడేశ్వరీదేవి జయంతి వేడుకలకు రావాలని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డిని ఉరవకొండకు చెందిన ఉరగాద్రి ఆలయ చైర్మన్ కొత్తశరత్, ఉట్టినారాయణస్వామి తదితరులు ఆహ్వానించారు. శుక్రవారం కొనకొండ్లలోని ఎమ్మెల్సీ నివాసానికి వెళ్లి ఆయన్ను ఆహ్వానించారు. ఉత్సవాల ఆహ్వాన పత్రికను అందించారు. జిల్లా కేంద్రంలో అనంతపురం మాజీ పార్లమెంట్ సభ్యుడు, కళ్యాణదుర్గం నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్యను కూడా ఉత్సవాలకు ఆహ్వానించారు.

వర్షం కోసం మారెమ్మ దేవతకు ఒడి బియ్యం

కూడేరు: ఉరవకొండ మండలం వై.రాంపురం మారెమ్మ దేవతకు ఒడి బియ్యం సమర్పిస్తే వర్షం కురుస్తుందని కూడేరు ప్రజల నమ్మకం. దీంతో శుక్రవారం ప్రతి ఇంటి నుంచి ఒడి బియ్యాన్ని సేకరించారు. అనంతరం బొంద్రాయి, పోతులయ్య, పెద్దమ్మ, మారెమ్మ అమ్మకు పూజలు చేశారు. ఒడి బియ్యాన్ని ట్రాక్టర్లో ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి అందించారు.

దివ్యాంగుడి ఆత్మహత్యాయత్నానికి కారకులను శిక్షించాలి

కళ్యాణదుర్గం రూరల్: కంబదూరు మండలం కుర్లపల్లికి చెందిన దివ్యాంగుడు వడ్డే శ్రీనివాసులు ఆత్మహత్యాయత్నానికి కారకులను శిక్షించాలని ఎస్సీ,ఎస్టీ జేఏసీ నాయకులు దొనతిమ్మప్ప, కళ్యాణదుర్గం నాయకులు చలిమప్ప తదితరులు కోరారు. కేవలం సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఓటు వేశారని దివ్యాంగుడికి పింఛన్ ఆపడం సరికాదన్నారు.

సంక్షిప్త సమాచారం


లైబ్రేరియన్‌కు శిరోమణి బిరుదు



బలరామాచార్యను సన్మానిస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం రూరల్: గండి ఆంజనేయ స్వామి క్షేత్రంలోని వాసవీ అన్నదాన సత్రంలో జూలై 29న రాష్ట్ర స్థాయి అఖిల భారత బ్రాహ్మణ మహా సంఘం గురు పురస్కారాలు నిర్వహించారు.ఇందులో ప్రతిభ కనబరిచిన కళ్యాణదుర్గం పాలిటెక్నిక్ లైబ్రేరియన్ బలరామాచార్యకు వ్యాఖ్యాన శిరోమణి బిరుదును శుక్రవారం అందించారు.

శాకంబరీదేవి అలంకరణలో వాసవీమాత



శాకంబరి అలంకరణలో వాసవీమాత

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కోటలో వెలసిన వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆషాఢమాసం చివరి శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. వాసవీమాత శాకంబరిదేవి అలంకరణలో పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. అన్ని రకాల కూరగాయలు, ఆకుకూరలతో చేసిన అలంకరణ విశేషంగా ఆకట్టుకుంది. పంచామృతాభిషేకం, కుంకుమార్చన, మహామంగళహారతి, తీర్థ ప్రసాద వినియోగం జరిగింది.

భక్తి శ్రద్ధలతో మాస శివరాత్రి వేడుకలు



కూడేరు: జోడు లింగాలకు ప్రత్యేక పూజలు నిర్వహించిన దృశ్యం

కూడేరు: మండల కేంద్రం కూడేరులో ప్రసిద్ధిగాంచిన శివపార్వతుల జోడు లింగాల సంగమేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం మాసశివరాత్రి వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆలయ అర్చకులు జోడు లింగాలకు 30 ద్రవ్యాలతో మహన్యాస ఏకవార రుద్రాభిషేకం, క్షీరాభిషేకం చేశారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. జోడు లింగాలను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు అర్చకులు తీర్థ ప్రసాదాలు అందించారు.

గజలక్ష్మి ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజలందుకున్న గజలక్ష్మిదేవి

రాయదుర్గంటౌన్: మల్లాపురం ఇందిరమ్మ కాలనీలో వెలసిన గజలక్ష్మి దేవికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి అభిషేకాలు చేసి హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. భక్తులు పాల్గొని పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. పట్టణంలోని దుగ్గిలమ్మ ఆలయం, దండుమారెమ్మ ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

ఈ పంట నమోదు పక్కాగా చేయాలి

వజ్రకరూరు: 2024 ఖరీఫ్ ఈపంట నమోదును పక్కాగా చేయాలని వ్యవసాయ అధికారి మధుకర్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఏఓ మాట్లాడుతూ ఈపంట నమోదుకు సిద్ధం కావాలని, పంట నమోదులో ఎక్కడా తప్పులు దొర్లకుండా చూడాలని ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో పర్యటించాలన్నారు. ప్రత్యాన్మాయంగా ప్రణాళికలు తయారు చేయాలని ఆదేశించారు. కౌలు రైతు పత్రాలకు సంబంధించి రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయంపైనా సమీక్ష చేశారు. కార్యక్రమంలో ఏఈఓ జానమ్మ, వీఏఏల లు, వీహెచ్‌ఏలు, ఎంపీఈఓలు తదితరులు పాల్గొన్నారు.

జీఓ 117ను రద్దు చేయాలి

శెట్టూరు: ప్రభుత్వం తీసుకొచ్చిన 117 జీఓను వెంటనే రద్దు చేయాలని ఏపీటీఎఫ్ నాయకులు రాష్ట్ర కౌన్సిలర్ కృష్ణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కేజీబీవీ, ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్లో ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు చేశారు. వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలపై నిరంతరం పోరాడుతామన్నారు. జిల్లా నాయకులు ఈరన్న, రవి, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విజయ్‌కుమార్, మురళీ, కోశాధికారి చంద్రశేఖర్, నాయకులు మద్రిస్వామి, సిద్దార్థ, శ్రీనివాసులు, వీరభద్ర, దాదాకలందర్, ఉమామహేష్, ఎస్‌ఓ లలిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేష్ఠం



తల్లిపాల వారోత్సవాల పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం



కూడేరు: తల్లిపాల ప్రాముఖ్యతను వివరిస్తున్న మండల వైద్యాధికారిణి సౌమ్యా రెడ్డి



కంబదూరులో చిన్నారికి అన్నప్రాసన చేస్తున్న సీడీపీఓ వనజ అక్కమ్మ

- కళ్యాణదుర్గం ఆర్డీఓ డాక్టర్ రాణీసుస్మిత

కళ్యాణదుర్గం: తల్లిపాలు బిడ్డకు శ్రేష్ఠమని ఆర్డీఓ డాక్టర్ రాణీసుస్మిత అన్నారు.శుక్రవారం స్థానిక సీహెచ్‌సీలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సీడీపీఓ, డాక్టర్లు రాజేశ్, అస్మా, అర్షద్, సూపర్‌వైజర్ ఓబుళమ్మలతో కలిసి పోస్టర్లను విడుదల చేశారు. ఆర్డీఓ మాట్లాడుతూ బిడ్డ పుట్టిన గంటలోపే ముర్రుపాలు పట్టించాలన్నారు. తల్లిపాలు బిడ్డకు అమృతంలాంటివన్నారు. సీడీపీఓ మాట్లాడుతూ తల్లి గర్భం దాల్చినప్పటి నుంచి బిడ్డ సంరక్షణ చూసుకోవాలన్నారు. ఈనెల 1 నుంచి 7వ తేదీ వరకు జరిగే వారోత్సవాలను జయప్రదం చేయాలన్నారు. రామ్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్వహిస్తున్న ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్డీటీ వైద్యులు, ఐసీడీఎస్ సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానం

బ్రహ్మసముద్రం: బిడ్డలకు తల్లి పాలు అమృతంతో సమానం అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఖాసీంబీ తెలిపారు. శుక్రవారం మండలంలోని గొంచిరెడ్డిపల్లి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో తల్లి పాల వారోత్సవాలు నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్ తిప్పేరమ్మ , గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

శెట్టూరు: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలోఎంపీపీ లక్ష్మీదేవి, సూపర్ వైజర్ రాధమ్మ, సర్పంచ్ కుమార్, వైస్ ఎంపీపీ చెవుల కిష్టప్ప, అంగన్‌వాడీ కార్యకర్తలు అరుణ, విశాల, భీమక్క, విమల, సీహెచ్‌ఓ శోభలత, ఏఎన్‌ఎం భారతి, ఆశాలు పాల్గొన్నారు.

బొమ్మనహాళ్: తల్లిపాలే చంటి పిల్లలకు శ్రీరామరక్ష అని వైద్యులు శ్రీలక్ష్మి, మల్లీశ్వరి అన్నారు. శుక్రవారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మండలంలోని బండూరులో గర్భిణులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త విజయలక్ష్మి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పోతపాలు వద్దు..తల్లిపాలు ముద్దు

రాయదుర్గంటౌన్: తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానం అని, వ్యాధి నిరోధక శక్తి పెరిగి ఆరోగ్యవంతంగా పిల్లలు ఎదుగుతారని అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యుడు అజహర్‌ఖాన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని బీటీపీ లేఅవుట్‌లోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ లక్ష్మీనారాయణ, హెల్త్ సూపర్ వైజర్లు లక్ష్మీనరసమ్మ, శాంతమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

గూళ్యపాళ్యంలో ఘనంగా తల్లిపాలవారోత్సవాలు

వజ్రకరూరు: తల్లిపాలే శిశువుకు శ్రీరామరక్ష అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి అన్నారు. శుక్రవారం మండలంలోని గూళ్యపాళ్యం గ్రామంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సువర్ణమ్మ, కృష్ణవేణి, ఏఎన్‌ఎం భ్రమరాంబ, ఆశాకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. మండలంలోని గంజికుంట గ్రామంలోనూ తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. వైద్యాధికారి సర్ధార్‌వలి, సూపర్‌వైజర్ సుశీలమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ సుధామాధురి, ఏఎన్‌ఎం జ్యోతి, అంగన్‌వాడీ కార్యకర్తలు లీలావతి, ఆనందమ్మ, ఆశా కార్యకర్తలు శాంతి, సావిత్రి, 104 సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కంబదూరు: పుట్టిన గంటలోపే బిడ్డకు ముర్రుపాలు తాగించాలని సీడీపీఓ వనజ అక్కమ్మ, వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి, పంచాయతీ కార్యాలయంలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులకు తల్లి పాల ఆవశ్యకతను వివరించారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతాలు, చిన్నపిల్లలకు అన్నప్రాసనం చేశారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ జ్యోతిలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు విజయనిర్మల, సంపత్తమ్మ, మరియమ్మ, మల్లికా, ఫరీదా తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలలో పోషకాలు అధికం

కూడేరు: తల్లిపాలలో పోషక విలువలు ఎక్కువగా ఉంటాయని గొటుకూరు సర్పంచ్ ఆశాలత తెలిపారు. శుక్రవారం కూడేరు గొటుకూరులో తల్లిపాలపై అవగాహన ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ చంద్రకళ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

కూడేరు: ప్రతి గర్భిణీ రోజుకు సుమారు అర గంట పాటు వాకింగ్, కొద్ది సేపు చిన్నపాటి వ్యాయామం తప్పని సరిగా చేయాలని, తద్వారా శిశువు ఆరోగ్యంగా ఉంటూ ఎదుగుదల ఉంటుందని మండల వైద్యాధికారిణి సౌమ్యా రెడ్డి తెలిపారు. శుక్రవారం కూడేరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. తల్లి పాలే బిడ్డకు శ్రీరామ రక్ష అన్నారు. ల్యాబ్ టెక్నీషియన్, ఎంఎల్‌హెచ్‌పీలు. ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.